క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఇబ్రహీంపట్నం: ఎలిమినేడు ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఐటీయూ మండల కన్వీనర్‌గా చందునాయక్



యాచారం: యాచారం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీఐటీయూ మండల కమిటీ సమావేశానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో యాచారం మండల కన్వీనర్‌గా మంతన్‌గౌరెల్లి గ్రామానికి చెందిన సభావట్ చందునాయక్‌ను నియమించారు. అనంతరం కార్మికుల సమస్యలపై చర్చించారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, పలు కంపెనీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంగయ్య, రాజ్యలక్ష్మి, కుమార్, కోటయ్య, ఆండాలు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మందజగన్నాథ్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యాదిలాల్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీలను బుధవారం హైదబాద్‌లోని తన నివాసంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాత్రిదేవికి సత్కారం



ధాత్రిదేవిని సత్కరిస్తున్న వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: జిల్లా సహకార శాఖ అధికారి ధాత్రిదేవిని.. డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్‌విండోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించుటకు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా సహకార శాఖ కార్యాలయంలో అధికారి ధాత్రిదేవిని గంపవెంకటేశ్‌గుప్త మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు సింగిల్‌విండో సీఈఓ దేవేందర్ తదితరులు ఉన్నారు.

టీపీసీసీ శిక్షణ తరగతులకు ఇబ్రహీంపట్నం నేతలు

ఇబ్రహీంపట్నం: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం బోయిన్‌పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో నిర్వహించిన టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ శిక్షణ తరగతుల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ భూపతిగాళ్ల మహిపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి శిక్షణ తరగతులకు హాజరయ్యారు. పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం, ధరణి సమస్యలు, రాహుల్‌గాంధీ చేపట్టిన పాదయాత్రకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రలపై నాయకులకు శిక్షణా తరగతులు నిర్వహించినట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: నిరుపేదలు, అభాగ్యులకు ఐక్యత ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన అనిల్ విద్యుదాఘాతంతో ఇటీవల మృతిచెందాడు. బుధవారం ఐక్యత చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి గట్టుఇప్పలిపల్లికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఫౌండేషన్ ద్వారా రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. వార్డు సభ్యులు మహేష్, నరేందర్, డేవిడ్, రాజశేఖర్, బాబురెడ్డి, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, భరత్‌రెడ్డి, శ్రీను, శివ, జనార్దన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

మాడ్గుల: మండలంలోని కొల్కులపల్లిలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన బండెల సాయి కిరణ్ కుటుంబసభ్యులకు బుధవారం ఎంపీపీ గౌరవరం పద్మారెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. కొల్కులపల్లిలో బండెల సాయికిరణ్ మృతదేహానికి నివాళి అర్పించిన ఎంపీపీ మృతుడి కుటుంబ సభ్యులకు వ్యక్తిగతంగా రూ.3వేల నగదును అందజేశారు.

శరవేగంగా విస్తరణ పనులు

- ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు 24 కి.మీ మేర రోడ్డు విస్తరణ
- రూ.600కోట్ల నిధులతో అభివృద్ధి
- రద్దీ ప్రాంతాల్లో 8 ఫ్లైఓవర్ల నిర్మాణం



విజయవాడ జాతీయ రహదారిపై కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

అబ్దుల్లాపూర్‌మెట్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా జాతీయ రహదారి విస్తరణ చేపట్టాలంటూ వస్తున్న ప్రతిపాదనలకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు జాతీయ రహదారి విస్తరణకు పచ్చజెండా ఊపడంతో గత కొన్ని రోజులుగా విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎల్‌బీనగర్ నుంచి దండుమల్కాపూర్ వరకు 24 కిలోమీటర్ల మేరకు ఇరువైపులా మూడేసి రహదారుల చొప్పున రోడ్డు విస్తరణ చేపట్టేందుకు రూ.600కోట్లు మంజూరు కాగా కోవిడ్ కారణంగా పెండింగ్ పడుతూ వస్తున్న విస్తరణ పనులు.. ప్రస్తుతం ఊపందుకున్నాయి. రూ.600 కోట్లతో 24 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారి విస్తరణ పూర్తయితే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి మినహా ప్రస్తుతం హయత్‌నగర్ నుంచి దండుమల్కాపూర్ వరకూ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

రద్దీ ప్రాంతాల్లో 8 ఫ్లైఓవర్ల నిర్మాణం..

విస్తరణలో భాగంగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో 8 ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రద్దీతో పాటు ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలను గుర్తించి ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నారు. ఎల్‌బీనగర్ నుంచి దండు మల్కాపూర్ వరకూ చేపడుతున్న రోడ్డు విస్తరణలో వనస్థలిపురం పనామా కూడలి వద్ద, హయత్‌నగర్‌లో కుంట్లూర్ రోడ్డు వద్ద, పెద్దఅంబర్‌పేటలో పసుమాముల రోడ్డు, కోహెడ రోడ్డు వద్ద, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఘటకేసర్ రోడ్డు, అనాజ్‌పూర్‌రోడ్డు, ఇనాంగూడ, బాటసింగారం కూడళ్ల వద్ద మొత్తం 8 ఫ్లై ఓవర్లు నిర్మించనున్నట్లు సమాచారం. రోడ్డు విస్తరణపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య తీరుతుంది

ఏళ్లుగా ఎదురుచూస్తున్న జాతీయ రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతుండటంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విస్తరణ వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరడంతోపాటు రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుముఖం పడతాయి. రద్దీ కూడళ్లలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఫ్లైఓవర్ల నిర్మాణంతో ఈ రహదారికి కొత్త శోభ రానుంది.

– ధనుంజయ్యగౌడ్, ఇనాంగూడ

దారి మళ్లిన నిధులు

- సర్వసభ్య సమావేశం నుంచి సర్పంచ్‌ల వాకౌట్
- కోరంలేక సభను వాయిదావేసిన ఎంపీపీ



ఎంపీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, సభ్యులు

మాడ్గుల: గ్రామ పంచాయతీ ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమచేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందంటూ మండల సర్పంచ్‌లు ఆరోపించారు. బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈమేరకు సభ్యులు వాకౌట్ చేసి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అంతకు ముందు ఎంపీపీ పద్మారెడ్డి అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా ఎంపీటీసీ సభ్యుల కోరం లేక ఆలస్యంగా ప్రారంభమైంది. సమావేశం ప్రారంభం కాగానే సర్పంచ్‌లు తమ ఖాతాల్లో జమ అయిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఒక్కరోజు వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు. అందుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఎంపీపీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఎంపీపీ పద్మారెడ్డి సభను వాయిదా వేశారు. ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు సంఘీభావం ప్రకటించారు. సమావేశంలో ఎంపీపీ పద్మారెడ్డితో పాటు సింగిల్‌విండో చైర్మన్ తిరుమల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త పాండుగౌడ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అంబళ్ల జంగయ్యగౌడ్, గౌరవ అధ్యక్షులు పులికంటి లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యులు పులికంటి లక్ష్మీ, పాలకూర్ల నారమ్మ, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలపారు. బుధవారం దరావతుల యాదమ్మకు రూ.49,500.. కొంగర ఆండాలు రూ.22,500.. లక్ష్మమ్మకు రూ.28,500 చొప్పున మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఉప్పరిగూడ సర్పంచ్ రాంరెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, కోఆప్షన్ సభ్యులు గోపాల్, తెరాస నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, చంద్రశేఖర్, మోహన్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.11వేల చెక్కు అందజేత..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన సాయి కుమార్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.11 వేలు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని తన నివాసంలో బుధవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి చెక్కును సాయికుమార్‌కు అందించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, విజయ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన అక్కాతమ్ముళ్లు

- తేజ, లిఖితశ్రీని అభినందించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- బహుమతుల ప్రదానం



లిఖిత శ్రీ, తేజశివరామ్‌ను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

యాచారం: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన అక్క, తమ్ముడు రాణిస్తున్నారు. గ్రామానికి చెందిన పర్వమోని శ్రీనివాస్ ముదిరాజ్, మంజుల దంపతుల సంతానం లిఖిత శ్రీ, తేజ శివరామ్ నగరంలోని అమరావతి టాలెంట్ స్కూల్లో చదువుతున్నారు. వారికి చిన్ననాటి నుంచి కరాటేపై ఆసక్తి ఉండటంతో గమనించిన తల్లిదండ్రులు వారిని వెన్ను తట్టి ప్రోత్సహిస్తున్నారు. ఏడాది క్రితం నగరంలో జరిగిన జాతీయ స్థాయి అండర్-12 కరాటే పోటీల్లో లిఖిత శ్రీ సిల్వర్ మెడల్ సాధించింది. తేజ శివరామ్ సైతం ఉత్తమ ప్రతిభ చూపాడు. గతేడాది డిసెంబర్ చివరలో కోయంబత్తూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో లిఖితశ్రీ గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించింది. తేజ శివరామ్ అండర్-11 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం నగరంలో తెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చిన్నారులను అభినందించారు. మరింత మంచిగా ఆడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన మాకం పాండయ్య కూతురు మనీషా (27) బాలింతరాలు. మనీషాను ప్రసవం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఈనెల 2న చేర్చారు. ఆమె సురక్షితంగానే ప్రసవించింది. అయితే ప్రసవం అనంతరం ఆమె ఆరోగ్యం సహకరించలేదు. దీంతో మంగళవారం రాత్రి మనీషా మృతిచెందింది. బుధవారం ఆమె అంత్యక్రియలను హైదరాబాద్ బడంగ్‌పేట్‌లో నిర్వహించారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కిష్టమ్మ హైదరాబాద్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, జయరాములు, అంజయ్య, వెంకటయ్య, పాండయ్య, కృష్ణవేణి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి కృషి

నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి

ఆమనగల్లు: వైఎస్సార్‌టీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి కోరారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలో బుధవారం చీమర్ల అర్జున్‌రెడ్డి పర్యటించారు. గ్రామగ్రామాన వైఎస్సార్‌టీపీ జెండా కార్యక్రమంలో భాగంగా పోలెపల్లి గ్రామంలో జెండా ఏర్పాటు గురించి స్థానిక నాయకులతో చర్చించారు. గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇటీవల మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3 వేలు ఆర్థికసాయం అందించారు. వైఎస్సార్‌టీపీ నాయకులు ప్రేమ్, సాయి, తానయ్య, వెంకట్‌గౌడ్, రమేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ వెల్జాల్ గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిని కోరారు. హైదరాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజనీర్ (ఈఎన్‌సీ) సంజీవరావును బుధవారం శ్రీనివాస్‌యాదవ్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వెల్జాల్ గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమయ్యే నిధులు మంజూరు చేయాలని కోరారు.

బాలిక సాధికారతపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఓ అనిత

ఆమనగల్లు: బాలికలు ఉన్నత విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి విద్యావంతులుగా ఎదగాలని జీసీఈసీ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ అనిత సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు బాలికా సాధికారత, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి



సీడీపీఓకు సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఈ సమ్మెకు సంబంధించిన నోటీస్‌లను మండల విద్యాధికారి, సీడీపీఓలకు వారు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, గ్రామీణ ఉపాధి హామీ తదితర 72 రకాల స్కీమ్ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేష్, మండల కన్వీనర్ బుగ్గరాములు, మంచాల మండల నాయకుడు కృష్ణ పాల్గొన్నారు.

జీవన్‌నాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌నాయక్



వినతిపత్రం ఇస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఆమనగల్లు: నాదర్‌గుల్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వారం రోజుల క్రితం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఆమనగల్లు మున్సిపాలిటీ నుచ్చుగుట్టతండాకు చెందిన విద్యార్థి జీవన్‌నాయక్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గన్యానాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి కృష్ణనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమశాఖ గురుకులాల అదనపు కార్యదర్శి సర్వేశ్వర్ రెడ్డిని బుధవారం బాధిత కుటుంబసభ్యులతో కలిసి వారు కలిశారు. జీవన్‌నాయక్ కుటుంబానికి ఆర్థికసాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, నాదర్‌గుల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని సర్వేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గడ్డి విత్తనాలు పక్కదారి

సంతకాలు లేకుండా పంపిణీపై ఎంపీపీ ఆగ్రహం

మాడ్గుల: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు రాయితీపై అందజేస్తున్న గడ్డి జొన్న విత్తనాలు పక్కదారి పడుతున్నట్లు మండల ప్రజాప్రతినిధులు, రైతులు ఆరోపిస్తున్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి ఇటీవల సుమారుగా 3 టన్నుల గడ్డి జొన్న విత్తనాలు ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసింది. కాగా వెటర్నరీ అధికారి మండల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కేవలం వారికి అనుకూలంగా ఉండే వారికి ప్రైవేట్ పాల వ్యాపారులకు సమాచారం ఇచ్చి వారి వద్ద నుంచి ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ సొమ్మును తీసుకుని ఒక్కొక్కరికి 50 కిలోల నుంచి క్వింటాలు వరకు విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై బుధవారం ఎంపీపీ పద్మారెడ్డికి రైతులు ఫిర్యాదు చేయగా స్థానిక వెటర్నరీ వైద్యాధికారి గ్యార శేఖర్‌ను తన చాంబర్‌కు పిలిపించుకుని ఆరాతీయగా సంతకాలు లేకుండా పలువురి పేర గడ్డిజొన్న విత్తనాలు పంపిణీ చేసినట్లు వెలుగు చూసింది. దీంతో ఎంపీపీ పద్మారెడ్డి వెటర్నరీ వైద్యులు శేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం గురించి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని మందలించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న భాషయ్య

మంచాల: మంచాల మండల పరిధిలోని పటేల్‌చెరువు తండాలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జనసందేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన సందేశ్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ వైస్ ఎంపీపీ దన్నె భాషయ్య మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు కూడా నిర్వహిస్తున్నామని, పేద విద్యార్థులకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల ఉప సర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్, పీఏసీయస్ డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి, నాయకులు రాజు, మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరును ఎండగడదాం

బీజేపీ నేత అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలో బుధవారం మండల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ పనితీరును ప్రజల్లో ఎండగట్టాలన్నారు. జాతీయ పార్టీ అధ్యక్షులు నడ్డా ఈనెల 7న వర్చువల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నాడని, బొంగ్లూర్ క్లాం జంగారెడ్డి గార్డెన్‌కు నేతలు హాజరై ఈ లైవ్ ప్రోగ్రాంలో పాల్గొనాలని కోరారు. పార్టీ భవిష్యత్‌పై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆపార్టీ నాయకులు అర్జున్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, శ్రీశైలం, దండెం శ్రీశైలం, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను బుధవారం వినోభానగర్‌లోని అంధుల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వికలాంగుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ వేదిక నాయకులు జె.రాజు, ప్రభాకర్, పాండురంగారెడ్డి, యాదగిరి, శివాజి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

తుర్కయంజాల్: మన ఊరు–మన బడి కార్యక్రమం మంచి పథకం అని కొహెడ కౌన్సిలర్ కంబాలపల్లి ధన్‌రాజ్, బాలరాజు, మండల రైతు బంధు కోఆర్డినేటర్ కందాల బల్‌దేవ్ రెడ్డి అన్నారు. కొహెడలోని ప్రభుత్వ పాఠశాలలో రూ.24 లక్షలతో అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్, వాటర్ సంపు నిర్మాణ పనులను బుధవారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ఉపాధ్యాయులు రాములు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న



ఆమనగల్లు: రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఆచారి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 8వ వార్డులో కౌన్సిలర్ జయశ్రీరాజు ఆధ్వర్యంలో రూ.30లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మణెమ్మ, విద్యావతి, రాజేందర్ ముదిరాజ్, అనురాధ, దీపిక, నరేందర్‌రెడ్డి, రోహిణి, అర్చన, అనుపమ, డీఈఈ అశోక్‌కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి..

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి అన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలకవర్గం పనిచేస్తుందని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీనివాసకాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్యతో కలిసి ఆచారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, లక్ష్మణ్, విక్రంరెడ్డి, గీత, యాదమ్మ, కోఆప్షన్ సభ్యులు శ్రీధర్, యాదమ్మ, నాయకులు నర్సింహ, శ్రీశైలం యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.